క్లుప్తంగా

12న ముగ్గుల పోటీలు

నాగులుప్పలపాడు: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు, చిన్నగంజాం, కొరిశపాడు, ఇంకొల్లు మండలాల స్థాయిలో ఈ నెల 12వ తేదీ ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కొంజేటి జలంధర్ తెలిపారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న మొదటి 60 మందికి మాత్రమే పాల్గొనే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా దివాన్ కాట్, రెండో బహుమతిగా సిల్వర్, మూడు, నాలుగో బహుమతులుగా వెట్ గ్రైండర్, 5వ బహుమతిగా మిక్సీ అందజేయనున్నట్లు వివరించారు. ఇతర వివరాలకు 98664 97631 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పేర్నమిట్ట సుందర సాయికి నేడు లక్ష పుష్పార్చన

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్టలో గల శ్రీ షిరిడీ సుందర సాయి మందిరంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి సుందర సాయిబాబాకు లక్ష గులాబీలతో పుష్పార్చన వేడుక నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు పేర్నమిట్ట హరిప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సరం, సంక్రాంతి వేడుకల్లో భాగంగా సాయిబాబాకు ప్రతి ఏటా వైభవంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిబాబాకు గులాబీలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న సంతనూతలపాడు జెడ్పీటీసీ దుంపా రవణమ్మ

సంతనూతలపాడు: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో సంతనూతలపాడు జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రవణమ్మ బుధవారం బూచేపల్లి సుబ్బారెడ్డి, వెంకాయమ్మ చారిటబుల్ ట్రస్ట్ తరఫున వందమంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పదోతరగతి విద్యార్థులు పరీక్షల్లో బాగా రాణించాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ దర్శి నాగమణి, హైస్కూల్ హెచ్ఎం ఎం.ప్రమోద, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ

చీమకుర్తి రూరల్: నూతన ఫీల్డ్ అసిస్టెంట్లకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఒంగోలు క్లస్టర్ స్థాయిలో స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో కె.రాఘవేంద్ర పాల్గొని మాట్లాడారు. ఒంగోలు, కొత్తపట్నం, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో నూతనంగా చేరిన ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఏపీఓ రాఘవ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై అవగాహన ఉండాలి

ఒంగోలు వన్‌టౌన్: ఈసీ సభ్యులు సమస్యల పరిష్కారం, నాయకత్వంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టీ రవికుమార్ అన్నారు. ఒంగోలు టీటీడీసీలో బుధవారం జిల్లాలోని 38 మండలాల్లోని ఏసీలు, ఏపీఎంలు, సీసీలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ పాలన, నాయకత్వంపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్థాగత నిర్మాణాల విభాగంలోని పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. సిఫ్ రికవరీలో ముందుండాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందజేయడంలో సిబ్బంది ముందుండాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రాపర్టీ షో

ఒంగోలు సబర్బన్: నగరంలో క్రెడాయ్ ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ప్రాపర్టీ షో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. స్థానిక ఎంఈపీఏ భవన్‌లో బుధవారం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.రాజేంద్ర, కే ప్రసన్నాంజనేయులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్థానిక పాత గుంటూరు రోడ్డులోని ఏ-1 ఫంక్షన్ హాలులో దాదాపు 55 నుంచి 60 వరకు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తుందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి మెటీరియల్స్, ప్రోడక్ట్స్‌ను ప్రదర్శనకు ఉంచనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు షో ఉంటుందన్నారు. బిల్డింగ్ మెటీరియల్స్, ఇంటీరియర్స్, భవన నిర్మాణాలకు కావాల్సిన అన్ని రకాల వస్తువులను ప్రదర్శనకు ఉంచుతున్నామన్నారు. బిల్డర్స్, లే అవుట్ వాళ్లు, ఇంటీరియర్స్ నిర్వాహకులు కూడా పాల్గొంటారన్నారు. అవసరమైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంబంధిత గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మునగా తిరుమల, సీహెచ్ రాఘవరెడ్డి, యలగాల ఐజాక్, గుప్తాస్ వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీల పేరుతో ఏరివేతకు కుట్ర



పింఛన్ లబ్ధిదారులతో ఐరిస్ తీసుకుంటున్న సిబ్బంది



పింఛన్ లబ్ధిదారుడిని చూసిన అనంతరం రిమార్క్స్ రాస్తున్న సిబ్బంది

- ముగిసిన దివ్యాంగ పింఛన్ల క్షేత్రస్థాయి పరిశీలన
- దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల జారీ నిలిపివేత
- కొత్త పింఛన్ల కోసం వితంతువులు, వృద్ధుల ఎదురుచూపులు
- కొత్త పింఛన్లు ఇవ్వకుండా ఉన్నవి తొలగించేందుకు కూటమి సర్కారు సిద్ధం

సంతనూతలపాడు: కొత్త ఏడాదిలో కూటమి ప్రభుత్వం పింఛన్‌దారుల పొట్ట కొట్టేందుకు సిద్ధమైంది. ఈ ఆర్నెల్ల పాలనా కాలంలో కొత్త పింఛన్లు ఇవ్వకపోగా.. ఉన్న పింఛన్లను నకిలీల పేరిట తొలగించేందుకు ఆదేశాలు ఇచ్చింది. ఇప్పటికే కొత్త పింఛన్లు మంజూరు చేయాలని వితంతువులు, దివ్యాంగులు ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి ఉన్నతాధికారులకు అర్జీలు అందజేస్తున్నారు. నకిలీ ధ్రువపత్రాలతో కొందరు దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో వారిని గుర్తించి తొలగించేందుకు కూటమి ప్రభుత్వం దివ్యాంగ పింఛనుదారుల్లో అనర్హులను గుర్తించేందుకు తనిఖీలు చేస్తున్నారు. సంతనూతలపాడు మండలంలోని నిన్న పూర్తి చేసిన గ్రామాలు మినహా మండలంలోని మద్దులూరు, వేములపాడు, తక్కెళ్లపాడు, చిలకపాడు తదితర గ్రామాల్లో బుధవారం జిల్లా వైద్యాధికారి టీ వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ ఎస్ సూరిబాబు తదితర వైద్యుల బృందం, ఇతర శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన విభాగంలో రూ.15 వేలు, వైకల్య ధ్రువపత్రాలతో రూ.6 వేలు చొప్పున పింఛన్లు పొందుతున్న వారి పత్రాలు, వివరాలను సమగ్రంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకుని, సంబంధిత యాప్‌లో వారి ఫొటోను అప్లోడ్ చేశారు. ఇతర నియోజకవర్గాల్లో నుంచి వచ్చిన వైద్యాధికారులు మంచానికే పరిమితమైన విభాగంలో పింఛను పొందుతున్న వారి ఇళ్లకు వైద్యులు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని, ఇతర వివరాలను పరిశీలించి సెర్ప్ రూపొందించిన యాప్‌లో వివరాలు పొందుపరిచారు. వైకల్య ధ్రువీకరణ పత్రాలతో పింఛను పొందుతున్న వారికి వచ్చేనెల ఫిబ్రవరి నుంచి సమీప ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైకల్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. తక్కెళ్లపాడులో ఓ వికలాంగ లబ్ధిదారురాలు జ్వరంగా ఉందని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు తెలుపగా వెంటనే చికిత్స చేయాలని సంబంధిత వైద్యులను ఆదేశించారు. సంతనూతలపాడు పీహెచ్‌సీ పరిధిలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారా లేదా నిర్వహిస్తున్నట్లయితే ఆ వికలాంగురాలికి జ్వరం అని తెలియదా అని ప్రశ్నించారు. ప్రజలకు అందాల్సిన వైద్య సేవల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డీ సురేష్ బాబు, వైద్యాధికారులు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఎంపీడీవో జ్యోతి



టగ్ ఆఫ్ వార్‌లో పోటీ పడుతున్న మెడికల్, సచివాలయ ఉద్యోగులు



మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు



ముగ్గులు వేసి పాటలు పాడుతున్న మహిళా ఉద్యోగులు

- మద్దిపాడు ఎంపీపీ అరుణ కోటిరెడ్డి

మద్దిపాడు: ఆటలతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల ఉద్యోగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం కోసం ఆటలాడుతూ ఉండాలని, వ్యాయామం వలన శారీరక ఉల్లాసంతో పాటు మానసిక ఉల్లాసం కూడా కలుగుతుందని అన్నారు. ఆటల పోటీలు, ముగ్గుల పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతిని సంతోష భవాని సాధించగా, ఎం.సుజీ రెండో బహుమతి సాధించారు. కన్సొలేషన్ బహుమతి కూడా అందించారు. మ్యూజికల్ చైర్స్‌లో ప్రథమ బహుమతిని పి.మానస సాధించగా, కే శివదుర్గ ద్వితీయ స్థానంలో నిలిచారు. లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో ఎస్.హేమలత ప్రథమ బహుమతి సాధించగా, ద్వితీయ స్థానంలో డి.సంతోష్ భవాని, తృతీయ స్థానంలో పి.మానస నిలిచారు. టగ్ ఆఫ్ వార్ పోటీల్లో వైద్య శాఖ, సచివాలయ సిబ్బంది తలపడ్డారు. కబడ్డీ పోటీల్లో ఈ రెండు జట్లు తలపడగా, సచివాలయ సిబ్బంది ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలకు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో వరప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సుగుణరావు, టైపిస్ట్ వినయ్, వైద్య ఆరోగ్య శాఖ సీహెచ్‌ఓ రంజిత కుమారి, సూపర్‌వైజర్ బాలకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శాంతిప్రియ

చీమకుర్తి రూరల్: మండలంలోని తొర్రగుడిపాడు సచివాలయం పరిధిలో గల ఎస్సీకాలనీలో జల్‌జీవన్ మిషన్ పనులను ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. కాలనీలో రూ.27 లక్షలతో మంజూరైన జల్‌జీవన్ మిషన్ పథకం కింద ప్రతి ఇంటికి ఉచితంగా మంచినీరు అందించనున్నారు. అందులో భాగంగా ఎస్సీకాలనీలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శాంతిప్రియ పర్యవేక్షణలో పనులు జరుగుతుండగా ఎంపీపీ పరిశీలించి మాట్లాడారు. కాలనీలోని ప్రతి ఇంటికి వరుస క్రమంలో తాగునీటి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని, పైపులు నేలలో వేసే క్రమంలో ఎత్తుపల్లాలు లేకుండా వాలుగా నీరు సరఫరా అయ్యేలా చూడాలని సూచించారు. కాలనీ వాసులు తుల్లూరి నటరాజు, బాలకోటయ్య మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేసి ప్రతిరోజూ తాగునీరు సరఫరా చేయాలని కోరారు.

రిఫ్రెషర్ ట్రైనింగ్ ప్రోగ్రాంతో ఉపయోగం

ఒంగోలు సిటీ: జిల్లాలో ఎంపిక చేసిన 40 పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఎంటర్ ప్రైమియర్ షిఫ్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన రిఫ్రెషర్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్ అన్నారు. బుధవారం స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రిఫ్రెషర్ ట్రైనింగ్ ప్రోగ్రాంను రమేష్ ప్రారంభించి మాట్లాడారు. హెచ్ఎం లక్ష్మీ ప్రసన్న, రిసోర్సుపర్సన్లు తిరుపతయ్య, పి.వి.శేషగిరి, నాగేశ్వరరావు, వాణి, ఎంపిక చేసిన పాఠశాలల ఉపాధ్యాయులు, జిల్లా మేనేజరు టి.రమణ కుమారి పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే మాదక ద్రవ్యాల నియంత్రణ



మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

- మత్తుపై యుద్ధం గీతావిష్కరణలో ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: గంజాయి లాంటి ప్రమాదకర మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ప్రజా గాయకుడు నూకతోటి శరత్ ఆలపించిన మత్తుపై యుద్ధం గీతాన్ని ఎస్పీ ఆవిష్కరించారు. గాయకుడు శరత్‌ను అభినందించారు. ఈ గీతాన్ని సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఒంగోలు సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కొల్లా మధు, దుగ్గినేని వెంకటరావు, పేస్ ఒలింపియాడ్ స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి జై బాపూజీ, జై సంవిధాన్ కార్యక్రమాలు

ఒంగోలు వన్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి జై బాపూజీ, జై సంవిధాన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ఎస్‌కే సైదా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ మనుగడకు కారణమైన రాజ్యాంగం రాసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై, ఆయన రాసిన రాజ్యాంగంపై బురద చల్లడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. పార్లమెంటు సాక్షిగా అంబేడ్కర్‌ను హోం మంత్రి అమిత్‌షా అవమానించినందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పంచాయతీలలోని దళిత సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్, మేయర్‌ను కలిసి అమిత్ షా రాజీనామా కోసం తీర్మానాలు చేయాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ నెల 12వ తేదీ అన్ని అసెంబ్లీ కూడళ్లలో రాజ్యాంగ పీఠికలోని ఒక పేజీని ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

ఫిషింగ్ హార్బర్‌తో మత్స్యకారులకు నష్టం

కొత్తపట్నం: ఫిషింగ్ హార్బర్‌తో మత్స్యకారులకు జరిగే నష్టం గురించి బహిరంగపరచకుండ మభ్యపెట్టి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేట్టాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని, దీనివలన రాబోయే రోజుల్లో గ్రామానికే ముప్పు ఏర్పడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి జీవీ కొండారెడ్డి హెచ్చరించారు. మండలంలోని కె.పల్లెపాలెం గ్రామంలో బుధవారం సీపీఎం బృందం పర్యటించింది. ఫిషింగ్ హార్బర్‌పై అభిప్రాయాలు సేకరించి రాబోయే రోజుల్లో నష్టాల గురించి వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కొండారెడ్డి మాట్లాడుతూ కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం గ్రామంలో రూ.392.45 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. అందుకోసం 17.54 ఎకరాల భూమిని సేకరించారన్నారు. పలుమార్లు ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. కానీ, నేటికీ ప్రారంభించలేదన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రారంభిస్తామని తెలిపిందని, కానీ, ఫిషింగ్ హార్బర్‌తో కలిగే లాభాలతో పాటు మత్స్యకారులకు జరిగే నష్టాల గురించి మాత్రం తెలియజేయకపోవడం సరికాదని మండిపడ్డారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపట్టి పెద్ద పెద్ద బోట్లకు పర్మిషన్ ఇవ్వటం వలన ఇక్కడ ఉండే చిన్న బోట్లకు మత్స్య సంపద ఉండదని వివరించారు. ఇంకా అనేక నష్టాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సూరిని స్వామిరెడ్డి, పట్టపు ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 34 అర్జీలు

కొత్తపట్నం: మండలంలోని రంగాయపాలెంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 34 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు తెలిపారు. క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లకు 3, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల కోసం 2, మ్యుటేషన్ కోసం 3, ఆన్‌లైన్ సబ్‌డివిజన్ కోసం 11, ఎఫ్‌లైన్ కోసం 15 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. అప్పటికప్పుడే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు 2, క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్లు 3 అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ వరప్రసాద్‌రావు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ యూనిట్లకు 19లోపు దరఖాస్తు చేసుకోవాలి

సంతనూతలపాడు: బీసీ కార్పొరేషన్ ద్వారా 2024–25 యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి బీసీ, ఈడబ్ల్యూఎస్ వారిలో అర్హులైన లబ్ధిదారులు సబ్సిడీతో కూడిన యూనిట్ల కోసం ఈ నెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి సంతనూతలపాడు మండలానికి 35 యూనిట్ల బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరైనట్లు చెప్పారు. కార్పొరేషన్ పర్యవేక్షణలో నాన్ బ్యాంకింగ్ రుణాలు 44 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈడబ్ల్యూఎస్ యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి మండలంలో 17 యూనిట్ల బ్యాంకు లింకేజీ రుణాలు ఉన్నాయన్నారు. నాన్ బ్యాంకింగ్ కింద ఆయా కార్పొరేషన్ పరిధిలో 110 యూనిట్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ నెల 8 నుంచి 19వ తేదీ వరకు ఆయా గ్రామాల సచివాలయాలు, ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా 18 సంవత్సరాలు దాటిన అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్, క్యాస్ట్, రైస్ కార్డు, బ్యాంక్ అకౌంట్ తదితర వివరాలను దరఖాస్తులలో పొందుపరచాలన్నారు. మండలంలోని సచివాలయాల్లో పూర్తి వివరాలను నోటీసు బోర్డులో ఉంచినట్లు తెలిపారు. ఈడబ్ల్యూఎస్ యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ వర్గాలు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీవో వెల్లడించారు. సెల్ ఫోన్ రిపేర్, డెయిరీ ప్రోడక్టు, మోడ్రన్ సెలూన్ షాపులు, బ్రిక్స్, మినీ డెయిరీ, బేకరీ, ఎలక్ట్రికల్, గొర్రెలు, ట్రాక్టర్, కార్పెంటర్, కంప్యూటర్, ఫిష్ తదితర యూనిట్లు మొత్తం కలిపి 52 యూనిట్లకుగానూ కోటి 45 లక్షల రూపాయలు కేటాయించినట్లు ఎంపీడీవో వివరించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి...

నాగులుప్పలపాడు: బీసీ కార్పొరేషన్ రుణాలకు నాగులుప్పలపాడు మండలంలోని అర్హులంతా దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వై.మహాలక్ష్మి తెలిపారు. ఆయా సామాజిక వర్గాలకు చెందిన వారు ఈ నెల 8 నుంచి గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ల సహకారంతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని సూచించారు.

ఆంజనేయులుకు జెడ్పీ చైర్‌పర్సన్ నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: చీమకుర్తిలో మృతిచెందిన చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు శీలం ఆంజనేయులకు బుధవారం జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. వయోభారంతో ఆంజనేయులు మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ చీమకుర్తి రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు సోమా శేషాద్రి, తప్పెట బాబూరావు, ఆముదాలపల్లి రామబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి మంగళ దీపారాధనలు



సంతపేట సాయిబాబా మందిరంలో తిరుప్పావై ప్రవచనంలో భక్తుల సామూహిక హారతులు



అనంత కోదండ రామస్వామి మందిరంలో గోదాదేవికి మంగళ దీపారాధనలో మహిళలు

ఒంగోలు మెట్రో: ధనుర్మాసం సందర్భంగా బుధవారం 24వ రోజు ఒంగోలు నగరంలోని వివిధ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. తిరుప్పావై 24వ పాశురం సందర్భంగా గోదాదేవి అమ్మవారికి దీపాల హారతులతో కన్నుల పండువగా భక్తులు మంగళ నీరాజనాలు పలికారు. ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక పీవీఆర్ హైస్కూల్ వద్ద ఘడియారం వారి వీధిలో అనంత కోదండరామస్వామి మందిరంలో తిరుప్పావై పారాయణ ప్రవచకులు శ్రీమాన్ భాగవతుల శ్రీనివాస చక్రవర్తి తిరుప్పావై ప్రవచనంలో భాగంగా గోదాదేవి శ్రీకృష్ణ పరమాత్మను ఆరాధించే విధానాన్ని వివరించారు. గాంధీ రోడ్డు గీతా మందిరంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచకుడు పొన్నూరు శ్రీనివాసులు తిరుప్పావై ప్రవచనం అందించారు. గుర్రంవారివీధి కోదండ రామస్వామి దేవస్థానంలో, పప్పుబజారులోని సీతారామ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో, దక్షిణం బజారులోని వెంకటేశ్వరస్వామి మందిరంలో, గద్దలగుంట ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో, కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో, వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ఆండాళ్ మహిళా భక్త బృందం దామచర్ల లక్ష్మీ ప్రసన్న కుమారి 24వ పాశురంలో సంకీర్తనలు చేశారు. పొన్నూరు శ్రీనివాసులు తిరుప్పావై పాశురాలు అందించారు. అనంతరం సామూహికంగా మహిళలు దీపారాధనలు చేశారు.



గీతా మందిరంలో గోదా శ్రీకృష్ణుల వేషధారణలో భక్త బృందం



స్థానిక మస్తాన్ దర్గా సెంటర్ మురళీకృష్ణ మందిరంలో దీపారాధనలో పాల్గొన్న మహిళా భక్తులు

సత్యనారాయణకు చుండూరు రవిబాబు నివాళులు



సత్యనారాయణకు నివాళులర్పిస్తున్న చుండూరు రవిబాబు

కొత్తపట్నం: కొత్తపట్నంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కుంతూరి సత్యనారాయణ మృతి చెందారు. బుధవారం అతని భౌతిక కాయానికి పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, వీఆర్సీ రెడ్డి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చుండూరు రవిబాబును కలిసిన రవీంద్రనాథ్‌రెడ్డి



చుండూరు రవిబాబును సన్మానిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ స్టూడెంట్ వింగ్ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన పల్నాటి రవీంద్రనాథ్ రెడ్డి బుధవారం ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబును ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, నాయకులు ఎస్.రమణారెడ్డి, వి.వెంకటేశ్వరరెడ్డి, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, పి.వెంకటేశ్వరరెడ్డి, సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, డి.విక్రమ్‌రెడ్డి, ఎం.వేణుగోపాల్‌రెడ్డి, డి.మహేంద్రరెడ్డి, కె.శివారెడ్డి, పి.మహేంద్ర, ఎం.ఉపేంద్ర, టి.సిద్ధారెడ్డి, ఎం.మహేంద్రరెడ్డి, ఎం.చైతన్యరెడ్డి, వి.చైతు, జి.రామకోటిరెడ్డి, ఏ వెంకటేష్‌రెడ్డి, య.మాధవ్‌కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

15వ డివిజన్‌లో కమిషనర్ పర్యటన

ఒంగోలు వన్‌టౌన్: నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు బుధవారం స్థానిక 15వ డివిజన్‌లో పర్యటించారు. రాంనగర్ 6వ లైన్ నుంచి 10వ లైన్ వరకూ ఉన్న సర్వీస్ రోడ్డు, డ్రైనేజీలను పరిశీలించారు. రాంనగర్ 9వ లైన్‌లో మున్సిపల్ పార్కును పరిశీలించారు. స్థానిక కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్, డీఈ పద్మజ, ఏఈ రాజశేఖర్‌రెడ్డి, సర్వేయర్ ఆవుల శ్రీనివాసరావు, టౌన్ ప్లానింగ్, పారిశుధ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.